క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ జాలి హనుమాన్, రహీంపురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జాలి హనుమాన్, బడీగల్లీ, మహంకాళీ దేవాలయం, రహీంపురా గ్రౌండ్, జెండా పీటీ, ఖగజీగూడ అవుట్ పోస్టు, సీబీఐ క్వార్టర్స్, కవేలీ మజీద్, సంజయ్ నగర్, పురానాపూల్ పోస్ట్ ఆఫీస్, లారీ అడ్డా తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ కార్వాన్, గుడిమల్కాపూర్, ఎఎస్‌ఆర్‌ఆర్ నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని మురాద్‌నగర్, చోటీ మసీద్, సయ్యద్ అలిగుడ, అలపాటి నగర్, కాల్విన్ హోటల్, చిల్లా పీటీ పోస్టాఫీస్, లంగర్‌హౌస్ రింగ్‌రోడ్డు, వినాయక నగర్, హరిదాస్‌పుర, అలంకార్ థియేటర్, రాజీవ్‌గాంధి నగర్, డిఫెన్స్ కాలనీ, వాపూనగర్, మెహిదీ కాలనీ, జితేందర్ ఫ్లోర్‌మిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

జషన్ కార్యక్రమాలకు ప్రత్యేక బస్సులు ప్రారంభం



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అంజుమన్–ఇ–అలావీ అక్బారీ వద్ద నిర్వహిస్తున్న జషన్–ఇ–హజ్రత్ అబ్బాస్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను దారుషిఫా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీర్ హైదర్ అలీ జాఫ్రీ సోమవారం ప్రారంభించారు.

గోమాత విశిష్టతను చాటి చెప్పాలి



గన్‌ఫౌండ్రీ: గోమాత విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పాలని నమో వందే గోమాతరం జాతీయ అధ్యక్షుడు పెరిక సురేష్ కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి జై శంకర్‌ను కలిసి గోమాత విగ్రహాన్ని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో భాగమైన గోమాతతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. గోమాత విశిష్టతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వందే గోమాతరం ప్రతినిధులు పాల్గొన్నారు.

మెడికో మృతిపై హెచ్చార్సీలో ఫిర్యాదు

నాంపల్లి: మెడికో ప్రీతి మృతిపై ఓయూ జేఏసీ నేతలు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ నేత సురేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రీతి కుటుంబాన్ని డీసీపీ జోయెల్ డేవిస్ తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గాంధీలో నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేసి కుటుంబసభ్యులను సైతం అనుమతించలేదని ఆరోపించారు. ప్రీతి మృతదేహానికి సీనియర్ డాక్టర్స్ చేత పోస్టుమార్టం చేయించలేదని, ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

సంజయ్‌కి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారం



సుల్తాన్‌బజార్: అంతరిక్ష పరిశోధనలలో చిన్న ఉపగ్రహాల అభివృద్ధిలో నిమగ్నమైన రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించిన సంజయ్ నెక్కంటి దేశం గర్వించదగ్గ యువ శాస్త్రవేత్త అని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. సోమవారం ఆకృతి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంజయ్ నెక్కంటికి ఆకృతి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారాన్ని హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వకులాభరణం కృష్ణమోహన్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, కొత్త వెంకటేశ్వర్‌రావు, దైవాజ్ఞశర్మ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో పరేషాన్

- చార్మినార్‌లో విజృంభిస్తున్న వీధి కుక్కలు
- భయాందోళనలో పర్యాటకులు, స్థానికులు
- కుక్కలను కట్టడి చేయాలని కోరుతున్న ప్రజలు



చార్మినార్ వద్ద సంచరిస్తున్న కుక్కలు

చార్మినార్: చార్మినార్ కట్టడం వద్ద వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. దీంతో అక్కడకు వచ్చే పర్యాటకులు, వీధి వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు గుంపులుగా వచ్చి దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. చార్మినార్ కాలిబాట పథకం (పెడస్ట్రియనైజేషన్ జోన్)లో భాగంగా చార్మినార్ కట్టడం నలువైపుల ఇప్పటికే గ్రానైట్ రోడ్లు ఏర్పాటు చేయడంతో వీధులన్నీ విశాలంగా మారాయి. దీంతో పాతబస్తీ చార్మినార్ పరిసరాల్లో రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అయితే చార్మినార్ గ్రానైట్ రోడ్లపై వీధి కుక్కల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతుంది. గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కల పట్ల సందర్శకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబర్‌పేట్‌లో జరిగిన వీధి కుక్కల దాడి మరువముందే నగరంలోని పలు ప్రాంతాల్లో కుక్కల దాడి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో చార్మినార్, మక్కా మసీదు, గుల్జార్‌హౌజ్, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. సాధ్యమైనంత వెంటనే వీధి కుక్కలను కట్టడి చేయాలని పర్యాటకులతో పాటు స్థానిక చిరు వ్యాపారులు కోరుతున్నారు.

‘అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం’



వాటర్ బోర్డు డైరెక్టర్‌తో సమావేశమైన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోశామహల్ నియోజకవర్గంలో వాటర్ బోర్డుకు సంబంధించిన మరమ్మతులు, అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతామని మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్ అజ్మీరా కృష్ణ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయనను కలిసి ఇమ్లిబన్‌లో బోర్ల మరమ్మతులు, నియోజకవర్గం నలుమూలలా వాటర్ బోర్డు మరమ్మతులు, అభివృద్ధి పనులపై మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా అజ్మీరా కృష్ణ మాట్లాడుతూ.. వేసవి కాలం వచ్చినందున గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో బోర్ల మరమ్మతులు వెంటనే చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా పాడైపోయిన బోర్‌వెల్స్‌ను వారం రోజుల్లో మరమ్మతులు చేయాలన్నారు. వేసవికాలం కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వాటర్‌బోర్డు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు పేర్కొన్నారు. అబిడ్స్‌లోని సుజాత డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. వాహనదారులందరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మహిళలు సైతం ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రయాణాలు సక్రమంగా కొనసాగించాలన్నారు. మహిళలు ధైర్యంగా ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తినప్పుడు పోలీస్ కంట్రోల్ 100కు ఫోన్ చేయాలని ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, వెంకట్‌ప్రసాద్, చక్రధర్, కాలేజీ డైరెక్టర్ జయప్రకాష్ సింగ్, ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం ప్రియాంక కళాశాలలో..

గోల్కొండ: రోడ్డు భద్రత, సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట ఏసీపీ శంకర్ రాజు అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని ప్రియాంక మహిళా డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పవన్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సేఫ్ డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ భవానీ, విద్యార్థినులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి



హోం మంత్రిని సత్కరిస్తున్న దీపాంకర్ పాల్

చార్మినార్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ సర్బోజనీన్ హరే కృష్ణ సంకీర్తన కమిటీ, హైదరాబాద్ బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన సంకీర్తన పూజా కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహమూద్ అలీకి బెంగాలీలు పూలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. పాతనగరంలోని బెంగాలీలు ప్రతి యేడు నిర్వహించుకునే ఈ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షుడు దీపాంకర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



లవ్ జీహాద్ ప్రతులను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

సుల్తాన్‌బజార్: మెడికో ప్రీతికి న్యాయం చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ఉస్మానియా మెడికల్ కళాశాలను ముట్టడించారు. ఈ సమాచారం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు ఇద్దరు ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మెడికల్ కళాశాలలు బంద్ ఇచ్చిన నేపథ్యంలో ఈ ముట్టడి చేశామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కల్యాణ్ అన్నారు.

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..

ప్రీతిపై వేధింపులకు నిరసనగా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ లవ్ జీహాద్‌ను అంతమొందించాలని కోరారు. బజరంగ్‌దళ్ సిటీ మీడియా ఇన్‌చార్జ్ భరత్‌వంశీ మాట్లాడుతూ.. ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌కు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను ఉరి తీయాలి..

గోల్కొండ: రాష్ట్ర పాలనను గాలికి వదిలేసి సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌కే పరిమితమయ్యారని బీజేపీ నాయకులు దేవర వంశీ అన్నారు. మెడికో ప్రీతి మృతిని ఖండిస్తూ సోమవారం గుడిమల్కాపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రీతి లాంటివారు మళ్లీ బలకాకుండా సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు సుధాకర్ యాదవ్, అశ్విన్ మోదీ, నాగరాజ్, ప్రభుపూజారి తదతరులున్నారు.

ర్యాగింగ్ విష సంస్కృతిని అరికట్టాలి ..

గన్‌ఫౌండ్రీ: సీనియర్ వేధింపులతో మృతిచెందిన మెడికో ప్రీతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఏబీవీపీ నిజాం కళాశాల అధ్యక్షుడు శ్రవణ్ అన్నారు. సోమవారం నిజాం కళాశాల ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ర్యాగింగ్ విష సంస్కృతి పెరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని డీసీఎం వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడకు చెందిన సత్యనారాయణ (39) గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జూబ్లీహిల్స్‌కు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. డీఎంఆర్ఎల్ ఎక్స్ రోడ్డు నుంచి ఐఎస్‌సదన్ మీదుగా వెళ్తుండగా.. క్రిస్టల్ బార్ సమీపం వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం సత్యనారాయణ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌కు సన్మానం

అబిడ్స్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన టీటీడీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మెట్టు విజయ్‌కుమార్ సోమవారం కలిశారు. జూబ్లీహిల్స్ ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవ వేడుకల్లో గవర్నర్‌ను ఆయన ఘనంగా సత్కరించారు.



ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గౌలిపురా: గౌలిపురా వివేకనందనగర్‌లోని శివనాగ లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు శ్రీకాంత్, రేఖారాణి ఆలయ ధర్మకర్త గౌరీ మోహన్ పర్యవేక్షణలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది సంక్షేమ పాలన: ఎమ్మెల్యే మాగంటి



చెక్కులు అందజేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

గోల్కొండ: బీఆర్‌ఎస్‌ది సంక్షేమ పాలన అని, సీఎం కేసీఆర్ పక్కా సెక్యులర్‌వాది అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్ల తండ్రి అప్పు చేయకుండా తన కూతురి పెళ్లి చేయడానికి ముఖ్యమంత్రి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకు లక్షలాది ఆడపిల్లల పెళ్లిళ్లు ఈ పథకం ద్వారా జరిగాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్‌కుమార్, పూస వేణుగోపాల్, లక్ష్మణ్, రమేష్, రాము, శ్రీను తదితరులున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

గోల్కొండ: ఏ ఒక్క విద్యార్థిని తక్కువ అంచనా వేయొద్దని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎస్ అనురాధ దేవి అన్నారు. సోమవారం గోల్కొండ భడాబజార్‌లోని పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మెదడుకు పదునుపెట్టారు. భూకంపాలు, ఫైర్ అలారం, క్లాప్ ఆన్ స్విచ్ ట్రైన్ డిటెక్ట్ వంటి అద్భుతమైన నమూనాలు తయారు చేసి తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులచే శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ అనురాధదేవి మాట్లాడుతూ.. ఇటీవలె టర్కీలో సంభవించిన భూకంపంపై విద్యార్థులు ఎంతగానో కదిలిపోయారని భూకంపాలు ఎందుకు సంభవిస్తాయి, వాటి తీవ్రత జరిగే నష్టాలను విద్యార్థులు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, సుబ్బారావు, కవిత, ఇజ్రాయెల్, నిర్మల, స్వాతి ప్రియాంక తదితరులున్నారు.



మైనార్టీ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి



కొప్పుల ఈశ్వర్‌ను సత్కరిస్తున్న సయ్యద్ ముజీబుద్దీన్

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర మైనార్టీల శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో తెలంగాణ మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు సోమవారం సమావేశమయ్యారు. మైనార్టీ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలపై చర్చించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నేత సయ్యద్ ముజీబుద్దీన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సయ్యద్ ముజీబుద్దీన్, షేక్ ముక్తార్, ఖాజా ఫయాజుద్దీన్, సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల అభ్యున్నతికి కృషి

గన్‌ఫౌండ్రీ: బేడ బుడగ జంగాల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో ఆల్ ఇండియా బేడ బుడగ జంగం కాన్ఫడరేషన్ ఆధ్వర్యంలో రచయిత ఎన్ఆర్.వెంకటేశం రచించిన బేడ బుడగ జంగం దర్పిని పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు సంచార జాతులను పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని కులాలను గుర్తించి ఆయా కులాల అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారతి బేడ బుడగ జంగాల రాష్ట్ర, వివిధ కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

విభిన్నంగా చెప్పడమే ఉత్తమ కవి లక్షణం

గన్‌ఫౌండ్రీ: ఉత్తమ కవి ప్రజల హృదయాల్లో సుస్థిరంగా నిలిచిపోతాడని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సాహిత్య వేదికల ఆధ్వర్యంలో కవిత్వ రచన, మౌలిక అంశాలు అనే అంశంపై సదస్సు, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... కొత్తగా ఆలోచించడం కవికి తప్పనిసరి అని విభిన్నంగా చెప్పగలగడం ఉత్తమ కవికి ఉండే సుగుణం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు చౌడారపు శ్రీధర్, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు సరోజినీదేవి, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు పాల్గొన్నారు.



కొత్తకోట సీఐపై హెచ్చార్సీలో ఫిర్యాదు



హెచ్చార్సీ ఎదుట ఫిర్యాదు ప్రతులను చూపుతున్న యుగంధర్‌గౌడ్, చిత్రంలో బాధితుడు శివయాదవ్

నాంపల్లి: తెలంగాణ ఉద్యమకారుడు శివయాదవ్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వనపర్తి జిల్లా, కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డిని విధుల నుంచి తొలగించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వనపర్తి జిల్లా మనిగిళ్ల గ్రామానికి చెందిన బాధితుడు శివయాదవ్‌తో కలిసి ఆయన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యుగంధర్‌గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. మనిగిళ్ల గ్రామానికి చెందిన శివ యాదవ్‌ను ఈనెల 22న వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చట్టవిరుద్ధంగా ఒక రోజంతా స్టేషన్‌లోనే నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని మండిపడ్డారు. సీఐపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం పనిచేస్తున్న కొత్తకోట వనపర్తిలో కూడా అనేక దందాలకు పాల్పడుతున్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై డీజీపీ, రాష్ట్ర బీసీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు శివ యాదవ్ మాట్లాడుతూ.. వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఓ పాత వీడియోను ఫార్వర్డ్ చేశానన్న నెపంతో వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నన్ను బూటు కాలితో తన్ని, టైర్‌తో విచక్షణా రహితంగా కొట్టడమే కాకుండా రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారన్నారు. మంత్రి నిరంజన్ రెడ్డి, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆరోపించారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు మహేందర్ నాయుడు, గ్రామస్తులు తిరుపతిరెడ్డి, రాజాగౌడ్, రాఘవేందర్, నరేష్ తదితరులు ఉన్నారు.

రెండు గోదాంలలో అగ్ని ప్రమాదం

లంగర్‌హౌస్: ప్రమాదవశాత్తు చెలరేగిన మంటల్లో రెండు గోదాంలు అగ్నికి ఆహుతయ్యాయి. లంగర్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.12 లక్షల ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ డిఫెన్స్‌కాలనీలో మూసీ నది ఒడ్డున మిర్జా ఇస్మయిల్ బేగ్, అతని తమ్ముళ్లు కలిసి స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్క్రాప్ గోదాములో మంటలు చెలరేగి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. అనంతరం మరో వైపు ఉన్న అత్తాపూర్‌కు చెందిన ముఖేష్ చౌదరికి చెందిన జగదంబ ట్రేడర్స్ వారి గోదాముకు మంటలు వ్యాపించి అందులోని వస్తువులు కాలిపోయాయి. ఘటనా స్థలానికి 4 ఫైర్ ఇంజన్లు చేరుకొని రెండున్నర గంటలపాటు శ్రమించి మంటలు ఆర్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటన స్థలంలో ఉద్రిక్తత..

అగ్నిప్రమాదం చోటుచేసుకొని మంటలు చుట్టుపక్క కాలనీలలో దట్టంగా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, స్థానికులు కలిసి ప్రమాదం జరిగిన గోదాము వద్ద ఆందోళనకు దిగారు. గోల్కొండ తహసీల్దారు, పోలీసుల ముందే గోదాముల నిర్వాహకులకు, స్థానికులకు గొడవ జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

‘అలనాటి దిగ్గజాలు చిరస్థాయిగా నిలిచి ఉంటారు’



పురస్కార గ్రహీతలతో ఎస్.వేణుగోపాలచారి

గన్‌ఫౌండ్రీ: ప్రజల గుండెల్లో స్థానం పొందిన వ్యక్తులు చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రాజ్ఞిక ఫౌండేషన్, ప్రాజ్ఞిక ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, కేవీఎల్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఇటీవల దివికేగిన అలనాటి సినీ దిగ్గజాలకు స్వరనీరాజనం పేరిట సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాతపస్వీ పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్, సూపర్‌స్టార్ కృష్ణ, జమున, కృష్ణంరాజు వంటి దిగ్గజాలను ఈ సమాజం ఎప్పటికి మర్చిపోదన్నారు. అనంతరం యువ నటుడు చాగంటి వంశీకి ప్రతిభా ప్రోత్సాహక పురస్కారాన్ని అందజేశారు. అంతకు ముందు గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు మాదవపెద్ది సురేష్, సామాజికవేత్త శరత్‌బాబు, ప్రాజ్ఞిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కోట శంకర్ ఆనంద్‌రావుకు మెమొంటో అందజేస్తున్న మున్నూరు కాపు ట్రస్టు ప్రతినిధులు

చార్మినార్: పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కార్యవర్గ సభ్యుడు కోట శంకర్ ఆనంద్ రావును మున్నూరు కాపు మహాసభ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని నామాల గుండు వద్ద మున్నూరు కాపు నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయనకు ఈ సన్మానం జరిగింది. నూతన భవనానికి ఆర్థిక సాయం చేసినందుకు సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ రావు, వెంకటేశ్వర్ రావు, లక్ష్మణ్, రమేశ్, వినోద్, అనిల్, రవికాంత్, శ్రీనివాస్ రావు, రామారావు, నాగరాజు, పవన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

‘కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై యుద్ధం తప్పదు’



బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆప్ నాయకులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వం విపక్షాలపై కక్ష్యపూరిత చర్యలకు పాల్పడుతుందని ఆమ్ ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిండి సుధాకర్ అన్నారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో నాంపల్లిల్లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ప్రజాస్వామ్య పార్టీలను, స్వరాలను శాశ్వతంగా అణచివేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజా యుద్ధం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఆప్ కార్యకర్తలు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆప్ కార్యకర్తలకు తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రాముగౌడ్, భుక్య శోభన్ తదితరులు పాల్గొన్నారు.